**కథానిక**

# కలిసివచ్చిన కలిమి

**కిరణ్**

ఆ రోజు కాఫీహోటల్లో ఒంటరిగా కూర్చుని ఫలహారం చేస్తూన్న రామేశాన్ని చూడగానే నాకు కాస్త ఆశ్చర్యంవేసింది. ఇంతకు క్రితం ఎప్పుడూ, ఎవరి ముఖాన కనిపించని విషాద చ్ఛాయలు అతడి ముఖంలో ప్రస్ఫుటంగా కనిపించాయి. శూన్యంలోకి చూస్తున్నాడు. ప్రపంచ భారమంతా తన బుజాలమీద మోస్తున్నవాడిలా కనిపించాడు. అతడి స్థితి చూచేసరికి నాకు జాలేసింది. దౌర్భాగ్యుడైన అతడి తమ్ముడే, మళ్ళీ అతని బాధకు కారణమని వెంటనే గ్రహించాను. "ఏంరా రామేశం! బాగున్నావా" అని ప్రశ్నించాను అతణ్ణి సమీపిస్తూ.

"ఈమధ్య ఒంట్లో ఏం కులాసాగా ఉండలేదోయ్ బ్రదర్" అన్నాడు రామేశం నా ముఖంలోకి చూస్తూ దీనంగా.

"ఏం, మళ్ళా మీ చలపతిగాడిని గురించేనా నీ బెంగ" అతడు బాధగా నిట్టూర్చి, "నీవూహించింది నిజమేనోయ్" అన్నాడు.

"చూడు రామేశం. ఇంకా నీవెందుకు వాడంటే ఇంత తాపత్రయపడుతున్నావో, నాకేం అర్థంగావటంలేదు. ప్రపంచంలో నీవు వాడికి చేయగలిగిందల్లా చేశావ్. వాడిక ఎందుకూ కొరగానివాడని తెలిసివుండికూడా వాడిమీద మమకారం చంపుకోలేకుండా ఉన్నావంటే, చిత్రంగావుంది."

ప్రతి సంసారంలో ఎవడో ఒకడు చెడపుడతాడు వంశకళంకంగా చలపతి తన ఇరవైయేళ్ళ జీవితమూ, విషమ పరీక్షగా తయారయ్యాడు. వాళ్ళ కుటుంబానికి అందరిలాగే చలపతి జీవితాన్ని ప్రారంభించాడు. వ్యాపారంలోకి దిగాడు. పెళ్ళి చేసుకొని ఇద్దరు పిల్లల్ని కన్నాడు.

ఆ చుట్టుపట్ల ఊళ్లల్లో వాళ్ళంటే మంచి మర్యాదస్తులని పేరుంది. ఆ వంశ ప్రతిష్టకు భంగం రాకుండా చలపతికూడా ప్రయోజనకరమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతాడని అందరూ ఆశించారు. కాని ఓ రోజు హఠాత్తుగా ఓ విచిత్రమయిన అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు చలపతి, తనకు వ్యాపారంలో అభిరుచిలేదనీ, గృహస్థజీవితానికి తనకూ పొసగదనీ, అంచేత స్వేచ్ఛావిహంగలా జీవితం గడప దలచాడు. ఎవరెన్ని విధాల నచ్చచెప్పచూచినా, వినే తత్వం కాదు చలపతిది. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనేరకం. పెళ్ళాన్ని పుట్టింటికి పంపించాడు. వ్యాపారాన్ని వదిలేశాడు. చేతిలో మిగిలిన కొద్ది పైకాన్ని తీసుకొని,దేశంలోని అన్ని ముఖ్యనగరాలను తిరిగాడు. చలపతి ఎన్ని ఊళ్ళు తిరిగినా, ఎప్పటికప్పుడు, ఇంట్లో బంధువర్గానికి అతడి ఆచూకీ తెలుస్తూనే ఉండేది. మొదట్లో బంధువులంతా అతని ప్రవర్తనకు విచలితులయినా, చేతిలో పైసా కరిగిపోతే ఇంటికి రాకేంచేస్తాడన్న ధీమాతో ఉండిపోయారు. చలపతి ఆ రెండేళ్లు, చేతిలో డబ్బున్నంతవరకూ ఆనందంగా గడిపాడు. చలపతి నీతినియమాలు లేనివాడే కావొచ్చు. కాని అతనిలోమాత్రం ఏదో ఆకర్షణ ఉంది. అతడు అప్పడిగితే ఇవ్వనని చెప్పినవాడిని నేనింతవరకు ఎరగను, స్నేహితులనుంచీ ఎంత సులభంగా డబ్బు రాబట్టుకోగలడో, అంత సులభంగా స్నేహితుల్ని ఆకట్టుకోగలిగేవాడు. మన దైనందిన అవసరాలకోసం డబ్బు ఖర్చుపెట్టటమంటే బాధగా ఉంటుందనీ, జల్సాకోసం. భోగలాలసత్వంకోసం డబ్బు వెచ్చించటమంటే, తనకెంతో హాయిగా ఉంటుందనీ అతడ వాదన. తన నిత్యావసరాలకోసంగా చలపతి ఎన్నడూ రామేశంమీద ఆధారపడింది లేదు.

రామేశం సహజంగా గంభీర స్వభావుడు. వ్యామోహాలకు సులభంగా లొంగేరకం కాదు. ఆ ఊళ్ళో అందరికీ రామేశమంటే గౌరవముంది. అంతకుక్రితం ఒకటిరెండు పర్యాయాలు, ఇకముందు తను సరిదిద్దుకొని బాగుపడతానని చలపతి ఇచ్చిన బూటకపు వాగ్దానాలకు మోసపోయి, ఇకనైనా

తమ్ముడు బాగుపడి సరికొత్త జీవితం ప్రారంభిస్తాడు కదా అన్న సద్భావంతో రామేశం చలపతికి పెద్ద పెద్ద మొత్తాలుగా కొంత పైకం ఇచ్చాడు. ఆ పైకం తీసికెళ్ళి చలపతి తాగుడుకూ, స్త్రీలకు పెట్టాడు, హారతి కర్పూరంలా డబ్బంతా హారించుకపోయింది. ఇక ఎప్పటికీ చలపతి జీవితంలో బాగుపడ, స్థిరపడబోడని తెలుసుకొని రామేశం, చలపతినిగురించిన ఆశలు పూర్తిగా వదులుకొన్నప్పుడు, కాస్తయినా వివేకంలేకుండా రామేశాన్ని గురించి విషప్రచారం సాగించటానికి చలపతి వెనుదీయలేదు. ఫలానా వకీలు రామేశంగారి తమ్ముడు కాఫీహోటల్లో కప్పులు కడుగుతున్నాడనో, రిక్షా లాగుతున్నాడనో, పదిమంది అంటే తనకెంత అప్రతిష్ఠ, తన వంశ గౌరవానికి యెంత కళంకం? రామేశం చలపతిని ఓ రాత్రి కలుసుకొని ఆ పనులు మానేయమన్నాడు. కాఫీక్లబ్బులో కప్పులు కడగడం కాని, రిక్షా లాగటంకాని తన దృష్టిలో చాల గొప్ప వృత్తులనీ, అంచేత తనా వృత్తిలోకి నిరభ్యంతరంగా దిగానని చెప్పాడు. కాని, అన్నగారికి ఒకవేళ, తనా పనులు చేయుట ఇష్టంలేకుంటే, తన జీవనానికిగాని, రెండువందల రూపాయలిస్తే, తనాపనులు మానివేయటానికి తనకెలాంటి అభ్యంతరమూ లేదన్నాడు. రామేశానికి ఇవ్వక తప్పింది కాదు.

ఒకమారు చలపతి జైలుకు వెళ్ళేటంత పనయింది. ఈవిషయం తెలియగానే రామేశం కంగారుపడ్డాడు. ఆకేసు వివరాలేవో తెలుసుకొని,చలపతి విడిపించేందుకు, రామేశం పూర్తిగా ఆ ఊబిలోకి దిగక తప్పిందికాదు. చలపతి ఇటీవల చాల చెడిపోయిన మాట వాస్తవమే. దుర్మార్గుడుగా, స్వార్థపరుడుగా, వ్యర్థుడుగా చలపతి తిరిగిన మాట నిజమే కావొచ్చు, కాని రామేశం ఉద్దేశం ప్రకారం చలపతి ఇంతకు ముందెప్పుడూ నిజయితీతప్పి ప్రవర్తించిందిలేదు. ఈ పరిస్థితులలో చలపతిని అరెస్టు చేయటమంటూ జరిగితే అతడికి శిక్షపడటం మాత్రం ఖాయం. కాని చూస్తూ, చూస్తూ, ఒక్కగానొక్క తమ్ముణ్ణి జైలుకెలా పోనివ్వగలడు? చలపతిచేత మోసగించబడ్డ నారాయణ, ఎలాగైనా చలపతి మీద పగతీర్చుకోవాలని పట్టుపట్టి కూర్చొని ఉన్నాడాయె. ఈ విషయాన్ని కోర్టుదాకా తీసుకెళ్ళి, చలపతిని శిక్షింపచేయాలని మొండికేసాడు. నారాయణను ఒప్పించి, అతను చలపతిమీద తీసుకోదలుచుకొన్న చర్యను ఉపసంహరింపచేయించేటప్పటికి తలప్రాణం తోకకి రావటమే కాకుండా చేతినుంచి, అయిదారు వందల రూపాయలు వదిలింది. కాని చేతినుంచి, డబ్బు వృధా అయినందుకు రామేశం ఎన్నడూ బాధపడలేదు. ఐదువందల చెక్కు మార్చుకొన్న ప్రక్కరోజే, చలపతి, నారాయణకలిసి, మద్రాసు మెరినా హోటల్లో కనిపించారని తెలుసుకొన్న రోజు, కనిపించినంత కోపం, రామేశం ముఖాన మరెన్నడూ చూడలేదు.

ఆ అయిదువందలతో చలపతీ నారాయణా జల్సాగా రెండుసెలలు రోజులు గడిపారట.

దాదాపు ఇరవై సంవత్సరాలు చలపతి, తిని తిరిగాడు; ఎన్ని వ్యసనాలున్నాయో అన్నీ అలవరచుకున్నాడు. పెద్దపెద్ద రెస్టారెంట్సులో సీతాకోక చిలకల్లాంటి పిల్లలను వెంటేసుకొని తిరిగాడు. ఎప్పుడూ ట్రిమ్ముగా తయారయి, అతినవీనంగా కనిపించేవాడు. నిజానికి వయస్సుకు నలభైయేళ్ళున్నా, అతణ్ణి చూచిన వాళ్ళెవరూ అతడికి అంత వయస్సుందంటే నమ్మేవారుకారు. ముప్పై, ముప్పయిదో ఉంటాయనుకొనేవారు. అతడు చాలా సరదామనిషి. అతడు పట్టి పనికిమాలిన వాడనీ తెలుసుండీ కూడా, అతడి సహవాసాన్ని కాసేపు ఆనందించకుండా ఉండలేరు. అతనిలోని అధికోత్సాహమూ, చలించని దర్పమూ, చలాకీదనమూ అందర్నీ ఆకర్షించేవి. తన అవసరాలకోసం, పదీ, అయిదూ, నా దగ్గర వసూలు చేస్తూవచ్చినా, అతడికి ఇవ్వటానికి నేనెప్పుడూ సంకోచించలేదు.

చలపతికి ఆ ఊళ్ళో అందర్నీ తెలుసు. అలాగే, అందరికీ చలపతంటే పరిచయమే. చలపతి ప్రవర్తన అందరూ ఏవగించుకొన్నా, ఎంచేతనో చలపతిని మెచ్చుకోకుండా ఉండలేక పోయేవారు.

పాపం! రామేశం చలపతికన్నా, ఏడాది మాత్రమే పెద్దయినా, అరవైయేళ్ళ వాడిలాగా అవుపించేవాడు. తన పాతికేళ్ళ లాయరు జీవితంలో ప్రతిరోజు ప్రొద్దుట తొమ్మిదిన్నరకి ఆఫీ

సుకు వెళ్ళి, సాయంత్రం ఆరున్నర అయ్యేవరకూ కదిలేవాడు కాడు. రామేశం చాలా నిజాయితీగా కష్టపడి పనిచేసి, శ్రమకు తగ్గ ఫలాన్ని పొందేవాడు. తన నలుగురు కూతుళ్ళను ఎంతో గారాబంగా పెంచాడు. అతడు ఓసారి ఒక నిశ్చయానికి వచ్చాడు—తనకు వచ్చే ఆదాయంలో మూడోవంతు దాచిపెట్టి, తను రిటైరయిం తర్వాత హాయిగా, ఏపల్లెలోనో ఓ చిన్న పాకవేసుకొని, సొంత సేద్యంపెట్టి జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని. ఆ రోజువరకూ, బ్రతుకులో ఎలాంటి ఆవకతవకలు లేకుండా, నిశ్చితంగా గడపగలిగాడు.

చలపతి కూడా తనతోబాటు ముసలివాడవుతున్నందుకు రామేశం మనసులో సంతోషించాడు. రామేశం అప్పుడప్పుడూ తన స్నేహితులతో "మీరంతా చలపతి అందగాడనీ, యువకుడనీ అభిప్రాయపడుతున్నారు కదూ! కాని వాడు ఏడాది మాత్రమే నా కంటే చిన్న. ఇహ నాలుగేళ్ళలో వాడికీ ఏభైఏళ్ళు నిండుతాయి. అప్పుడు వాడిజీవితం అంత సుకరంగా, హాయిగా కనిపించదు. నాకేం నే రిటైరు అయ్యేసరికి 30 వేల ఆస్థి ఉంది. వాడికే ముంది? వాడిబొంద. నేను ఇదేమాట ఇరవైయేళ్లుగా చెబుతూవచ్చాను. చలపతి బ్రతుకు చివరకీ దిక్కులేని బ్రతుకవుతుందని నాకు ఏనాడో తెలుసు. వాడి జీవితం చివరి కెలా పరిణమిస్తుందో మీరూ చూస్తారుగా. సోమరిబోతుగా తినితిరిగితే బ్రతుకులో హాయి ఉంటుందో లేక కష్టించి బ్రతికితే మంచిదో చూడాలి మరి." అనేవాడు.

కాని ఎందువల్లనో, ఆరోజు ఒంటరిగా రామేశాన్ని కాఫీహోటల్లోచూసేసరికి, నాకు అతనిపైన అకారణసానుభూతి కలిగింది. మళ్ళీ ఆ చలపతిగాడు ఏ అప్రతిష్ఠపని చేసాడోనని ఊహించుకొంటూ, రామేశంప్రక్కన కుర్చీలో కూర్చున్నాను. రామేశం పూర్తిగా కలవరపడ్డట్లున్నాడు. మతిచలించిన వాడిలాగా కనిపించాడు.

"ఏం జరిగిందో నీకుతెలుసా" అన్నాడు నా వంకచూస్తూ. అతడు ఎలాటి ఘోరవార్త చెప్పదలుచుకొన్నా, నేను వినటానికి తయారయ్యాను. మళ్ళా ఏ అఘాయిత్యమో చేసి ఆ చలపతి పోలీసులచేతుల్లో చిక్కుకొన్నాడేమోనని ఊహించుకొంటున్నాను. రామేశం ఎంతో కష్టంమీదగాని మాట్లాడలేకపోయాడు. "నా జీవితపర్యంతమూ నేను కష్టపడ్డాను. శ్రమపడి శ్రమకు తగ్గఫలితాన్ని పొందాను. గౌరవంగా, నిజాయితీగా బ్రతికాను. ఈ విషయాన్ని నువ్వు కాదనబోవనుకొంటూ. ఉద్యోగం విరమించుకొన్నాక హాయిగా, ఏ ప్రశాంతస్థలంలోనో, నాకువచ్చే కొద్దిపాటి ఆదాయంతో నా శేషించిన జీవితాన్ని గడపదలుచుకొన్నాను. ఈ అభిప్రాయంతోనే, నా కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చాను. నాఅదృష్టంబాగుండి నా కోరికలు నెరవేరేరోజులు వచ్చాయనుకొన్నాను" అని నావంక చూశాడు. నేను ఔనన్నట్లు తలపంకించాను మరలా అతడే చెప్పటం మొదలుపెట్టాడు.

"చలపతి బ్రతుకు ఎలాంటిదోకూడా నీకు తెలుసు. పచ్చిరౌడీగా,సోమరిపోతుగా తయారయి తన బ్రతుకంతా వ్యర్థంచేసుకొన్నాడు. దేశంలో చట్టం, న్యాయమనేవి ఉండుంటే చలపతి యీసరికి ఏ జైలు కటకటాల వెనుకనో ఉండవలసినవాడు."

"నీవుచెప్పింది అక్షరాలా నిజం" అన్నాడు.

రామేశంముఖం జేవురించుకొంది.

"ఈమధ్య ఆ వెధవ ఏంచేసాడనుకున్నావ్. ఎవతెనో, వయసులో తనకంటే పదేళ్లు పెద్దదాన్ని పెళ్ళిచేసుకొన్నాట్ట. చూచినవాళ్ళంటారు. ఆమె వీడూ ప్రక్కపక్కల నిలుచుంటే తల్లిబిడ్డలనుకొనే వాళ్ళట. ఏమయితేనేం, ఆమె చచ్చింది. దాదాపు ఓ లక్షరూపాయలరొక్కం, పట్నంలో ఒకయిల్లు, పదిఎకరాలపొలమూ అన్నీ చలపతిగాడికి సంక్రమించాయట." ఈ మాట అంటూన్నప్పుడు రామేశం ఉద్రిక్తుడవటం గమనించాను. పిడికిలి బిగించి బల్లగుద్దుతూ "ఇదేం బాగులేదు. ఇది అక్రమం; అన్యాయం"అన్నాడు ఆవేశంతో.

జేవురించిన రామేశం ముఖంచూసేసరికి నేను నవ్వకుండా ఉండలేకపోయాను. బిగ్గరగా నవ్వేశాను. రామేశం నాచర్యకు కోపగించుకొన్నాడు. ఆరోజు లగాయితు ఈరోజువరకూ నాతో మాట్లాడిందిలేదు.కాని చలపతిమాత్రం తరచూ నన్నువాళ్లింటికి విందులకు ఆహ్వానిస్తూంటాడు. అతడు అప్పుడప్పుడూ చిన్నచిన్న మొత్తాలుగా బదుళ్లుతీసుకొంటున్నాడంటే,అది కేవలం తన పాతఅలవాటును మరిచిపోలేకనే. అదయినా ఎన్నడూ ఒక్కరూపాయికి మించలేదు. (సోమర్‌సెట్ మాఘమ్ కథ ఆధారంగా)